క్లుప్తంగా

ఈవీఎం వీవీప్యాట్‌లపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న అధికారులు

కమాన్‌పూర్‌: రామగిరి మండలంలోని రత్నాపూర్‌, బేగంపేట గ్రామాల్లో ఈవీఎం, వీవీప్యాట్‌లపై ప్రజలకు మంగళవారం వ్యవసాయ శాఖ అధికారి అరవింద్‌ అవగాహన కల్పించారు. ప్రజలు ఎన్నికలప్పుడు ఈవీఎం, వీవీప్యాట్‌లపై ఓటు ఎలా వేయాలో అవగాహన కల్పించారు. సర్పంచ్‌లు బుర్ర పద్మ, పల్లె ప్రతిమ, టీచర్లు గోపు రవీందర్‌రెడ్డి, నాయకులు పీవీ రావు, బుర్ర శంకర్‌ పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణ సంఘం కమిటీ ఎన్నిక


ఎన్నికైన సంఘం కమిటీ సభ్యులు

సుల్తానాబాద్‌రూరల్‌: సుల్తానాబాద్‌ మండలం గర్రెపల్లి గ్రామ నాయీబ్రాహ్మణ సంఘం నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా సముద్రాల రాజు, ప్రధాన కార్యదర్శిగా సూరంపెల్లి సంపత్‌, ఉపాధ్యక్షులుగా సూరంపెల్లి రవి, ఆవుదుర్తి తిరుపతి, కోశాధికారిగా ఎలగందుల రమేశ్‌బాబు, గౌరవ అధ్యక్షులుగా పెయ్యావుల రామస్వామి, ఆవుదుర్తి శ్రీనివాస్‌, గౌరవ సలహాదారులుగా జనగామ సురేశ్‌, ప్రచార కార్యదర్శిగా సూరంపెల్లి లక్ష్మన్‌ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

సీజనల్‌ వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలి


మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి రంగారెడ్డి

జూలపల్లి: వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి సీజనల్‌ వ్యాధులు రాకుండా చూసుకోవాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా వెనకబడిన తరగతుల సంక్షేమాధికారి రంగారెడ్డి సూచించారు. మండలంలోని వెంకట్రావుపల్లెలో మంగళవారం ఎంపీడీవో వేణుగోపాలరావుతో కలిసి గ్రామంలో నర్సరీ, అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాల, పల్లె దవాఖానను ఆకస్మిక తనిఖీ చేశారు. గ్రామంలో నీరు నిల్వ లేకుండా చూడాలని కార్యదర్శిని ఆదేశించారు. ఎంపీవో కిరణ్‌, ఏఎన్‌ఎం లక్ష్మి ఉన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

పెద్దపల్లిరూరల్‌: విద్యారంగంలో నెలకొన్న సమస్యలు, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని టీపీఎస్‌యూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అనిల్‌ప్రసాద్‌, వెంకటేశ్వర్‌రెడ్డి కోరారు. మంగళవారం స్థానిక తహసీల్దార్‌ వెంకటలక్ష్మికి వినతిపత్రం అందించారు. పీఆర్‌సీ కమిటీ వేసి ఐఆర్‌సీ ప్రకటించాలని కోరారు. నాయకులు శ్రీనివాసరావు, మునికుమార్‌, గణేశ్‌ ఉన్నారు.

శ్రమదానంలో పాలకవర్గం


కచ్చా కాలువ తవ్వుతున్న సర్పంచ్‌ మల్లేశం, ఉపసర్పంచ్‌ రాజు

పెద్దపల్లిరూరల్‌: ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు రోడ్లపై నిలిచిన నీటిని బయటకు పంపేందుకు ప్రజాప్రతినిధులే కూలీల అవతారమెత్తారు. పెద్దపల్లి మండలం బ్రాహ్మణపల్లి సర్పంచ్‌ గాండ్ల మల్లేశం, ఉపసర్పంచ్‌ ఓదెల రాజు పలుగు, పార పట్టి కచ్చా కాలువను తవ్వారు.

కుర్చీలు అందజేత

గోదావరిఖనిటౌన్‌: బీఆర్‌ఎస్‌ యూత్‌ కోఆర్డినేటర్‌ దొమ్మేటి వాసు జన్మదినం సందర్భంగా 37వ డివిజన్‌లోని నాలుగు అంగన్‌వాడీ కేంద్రాలకు 70 కుర్చీలు అందజేశారు. అనంతరం ఫైవింక్లయిన్‌ చౌరస్తాలోని పేదలకు అన్నదానం చేశారు. బీఆర్‌ఎస్‌ నాయకులు తోడేటి శంకర్‌గౌడ్‌, పర్లపెల్లి రవి, నారాయణదాసు మారుతి పాల్గొన్నారు.

ఆగని వర్షం.. అంతా వరదమయం

- పొంగి పొర్లుతున్న వాగులు
- మత్తడి దుంకుతున్న చెరువులు
- కూలిన ఇండ్లు
- నీట మునిగిన పంటచేలు


రామగుండం: వరద నీటితో ప్రవహిస్తున్న పెద్ద మోరీ


కాల్వశ్రీరాంపూర్‌: జాఫర్‌ఖాన్‌పేట మద్దెల వాగు వద్ద హెచ్చరికలు చేస్తున్న తహసీల్దార్‌ సుధాకర్‌


ఎలిగేడు మండలం ధూళికట్టలో..

సుల్తానాబాద్‌: సుల్తానాబాద్‌ మున్సిపల్‌ పరిధిలో భారీ వర్షాలకు పంట పొలాలు నీట మునిగాయి. అలాగే పట్టణంలో పలు ప్రాంతాల్లో డ్రైనేజీ నీరు రోడ్డు పైకి రావడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. మున్సిపల్‌ సిబ్బంది, అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టి నీటి నిల్వలు లేకుండా చేశారు.
కాల్వశ్రీరాంపూర్‌: వాన జోరుకు వాగులు వంకలు, చెరువులు, కుంటల మత్తడి దుంకుతున్నాయి. ఇండ్లు, గోడలు కూలుతున్నాయి. పంటచేన్లు నీట మునగాయి. కల్వర్టులపై వరద వేగం ఉధృతంగా ఉండడంతో రాకపోకలు నిలిచాయి. చెరువులు నిండి మత్తడి దుంకుతున్నాయి.
జూలపల్లి: మండల కేంద్రం నుంచి వెళ్లే హుస్సేన్‌ మియా వాగు లోలెవల్‌ వంతెనను తాకుతూ పారుతోంది. కూలిన ఇండ్లను రెవెన్యూ అధికారులు పరిశీలించారు. 5 సె.మీ వర్షపాతం నమోదైంది.
రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని మేడిపల్లి ఓపెన్‌కాస్టు బాధిత గ్రామమైన లింగాపూర్‌లో పలువురి ఇండ్ల గోడలు కూలిపోయాయి.
సుల్తానాబాద్‌: సుల్తానాబాద్‌ ఊర చెరువు మత్తడి దుంకుతోంది. సుల్తానాబాద్‌, సుగ్లాంపల్లి, చిన్న బొంకూర్‌ గ్రామాల్లో ఉన్న వ్యవసాయ భూములు సాగులోకి రానున్నాయి.
సుల్తానాబాద్‌రూరల్‌: మండలంలోని గ్రామాల్లో వరద నీటితో చెరువులు, కుంటలు జలమయంగా మారాయి. అలాగే మండలంలోని ఇండ్లు పాక్షికంగా కూలిపోయాయి.
ఎలిగేడు: మండలంలోని ధూళికట్ట ఊర చెరువు మత్తడి దుంకుతోంది. ఆర్‌అండ్‌బీ రోడ్డుపై వరద నీరు ప్రవహిస్తుండటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ధూళికట్ట–వడ్కాపూర్‌ గ్రామాల మధ్య నున్న హుస్సేనిమియా వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.


కాల్వశ్రీరాంపూర్‌: మడిపెల్లిలో మత్తడి దుంకుతున్న పెద్దచెరువు


సుల్తానాబాద్‌రూరల్‌: చేపల వేటలో మత్స్యకారులు


సుల్తానాబాద్‌: నీట మునిగిన పంటపొలాలు


కాల్వశ్రీరాంపూర్‌: కూనారం జగదాంబ ఒర్రెపై వరదప్రవాహంతో నిలిచిన రాకపోకలు


కాల్వశ్రీరాంపూర్‌: మల్లయ్యపల్లెలో కూలిన రాజేశ్వరి ఇల్లు


కాల్వశ్రీరాంపూర్‌: వెన్నంపల్లి గ్రామంలో పంటపొలాల్లో చేరిన వరద నీరు


రామగుండం: వరద నీటి మళ్లింపు


రామగుండం: కూలిన గోడ

ఎన్నికల్లో బీఎల్‌వోల పాత్ర కీలకం


శిక్షణ ఇస్తున్న అధికారులు

ఎలిగేడు: మండలకేంద్రంలోని మండల పరిషత్‌ కార్యాలయంలో ఎన్నికల కమిషన్‌ ఆదేశాల మేరకు రెండో ఓటర్ల సవరణ జాబితాలో భాగంగా ఎలిగేడు, జూలపల్లి మండలాలకు చెందిన బూత్‌లెవల్‌ ఆఫీసర్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌ నాగరాజమ్మ మాట్లాడుతూ ఎన్నికల్లో బీఎల్వోల పాత్ర కీలకమైందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో పూర్తిస్థాయిలో పనిచేయడానికి ప్రభుత్వం ఈ శిక్షణ ఏర్పాటు చేసిందని, ప్రతి ఒక్కరూ శిక్షణ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పలు అంశాల గురించి వివరించారు. అనంతరం బీఎల్వోలకు పరీక్ష నిర్వహించారు కార్యక్రమాన్ని పరిశీలించడానికి వచ్చిన డిస్ట్రిక్ట్‌ లెవల్‌ మాస్టర్‌ ట్రైనర్‌ సీహెచ్‌ ఆగయ్య మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ మొత్తంలో బీఎల్వోలు కీలకమని, వారు చేసిన ఫీల్డ్‌సర్వేపైనే ఎన్నికలు మొత్తం ఆధారపడి ఉన్నాయని, పూర్తిస్థాయిలో ఓటర్ల సవరణ కార్యక్రమంలో పాల్గొనాలని ఆదేశించారు. అసెంబ్లీ నియోజకవర్గ మాస్టర్‌ ట్రైనర్స్‌ ఎస్‌.సుదర్శనం, శ్రీరాంరెడ్డి, శ్రీనివాస్‌, రాజేందర్‌, ఎలిగేడు డిప్యూటీ తహసీల్దార్‌ సాయికృష్ణ, ఆర్‌ఐలు శైలజ, రజిత, రెండు మండలాల బీఎల్వోలు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతి

కోల్‌సిటీ: గోదావరిఖని ప్రభుత్వ జనరల్‌ ఆస్పత్రి(జీజీహెచ్‌)ను మంగళవారం కలెక్టర్‌ ముజమ్మిల్‌ ఖాన్‌ సందర్శించడానికి వచ్చిన సందర్భంగా, పలువురు కలెక్టర్‌కు వినతి పత్రాలు అందజేశారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్‌లోని వివిధ విభాగాల్లో 15ఏళ్లుగా పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్‌ ఉద్యోగుల గడువును పునరుద్ధరించాలని, రామగుండం ప్రభుత్వ జనరల్‌ ఆస్పత్రిలో ఉద్యోగ భర్తీ సమయంలో ప్రాధాన్యం కల్పించాలని కోరారు. ఉద్యోగులు శివ, ప్రకాశ్‌, ఫిరోజ్‌, కిషన్‌, రామకృష్ణ, సాగర్‌, సంధ్య, వివేక్‌, రాములు కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఆస్పత్రిలో దోబీగా పని చేస్తున్న గుండ్రాతి భాగ్యమ్మను రెండు నెలలుగా అధికారులు విధులకు దూరంగా ఉంచారని, తనను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ కలెక్టర్‌ను వేడుకుంది.

యువత ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలి


మాట్లాడుతున్న సీఐ జగదీష్‌

సుల్తానాబాద్‌రూరల్‌: యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని సీఐ జగదీష్‌ సూచించారు. సుల్తానాబాద్‌ సర్కిల్‌లోని సుల్తానాబాద్‌, జూలపల్లి, కాల్వశ్రీరాంపూర్‌, పొత్కపల్లి పోలీసుస్టేషన్ల పరిధిలోని యువతకు పట్టణంలోని నరహరి ఫంక్షన్‌ హాల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ప్రస్తుత జీవనశైలిలో యువత ఒత్తిడిని జయించలేక దురలవాట్లకు బానిసలు అవుతున్నారన్నారు. ఆన్‌లైన్‌ మోసాలు, సైబర్‌ క్రైమ్‌లపై తల్లిదండ్రులకు, సమీప బంధువులకు అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే యువత సమాజ సేవలో రాణించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సైలు విజేందర్‌, శ్రీనివాస్‌, వెంకటకృష్ణ, పోలీసు సిబ్బంది, యువకులు ఉన్నారు.

కోడిగుడ్లను ప్రభుత్వమే సరఫరా చేయాలి


వినతిపత్రం అందిస్తున్న వర్కర్లు

పెద్దపల్లిరూరల్‌: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజన సమయంలో అందించే కోడిగుడ్లను ప్రభుత్వమే సరఫరా చేయాలని వర్కర్ల సంఘం నాయకుడు పూసాల రమేశ్‌, కడారి సునీల్‌ కోరారు. మంగళవారం అడిషనల్‌ కలెక్టర్‌ శ్యాంప్రసాద్‌లాల్‌ను కలిసి వినతిపత్రం అందించారు. బహిరంగ మార్కెట్‌లో గుడ్లకు ధర ఎక్కువ ఉందని, ప్రభుత్వం చాలా తక్కువ మొత్తాన్ని నెలల తరబడి బిల్లులు చెల్లించకపోవడంతో ఆ భారాన్ని తాము మోయలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఉదయం వంట చేసేందుకు గ్యాస్‌ ప్రభుత్వం సరఫరా చేయాలన్నారు. కార్మిక సంఘం నాయకులు ఓదెల రమేశ్‌, వసంత, లావణ్య, లలిత, లీలావతి, రత్నమాల, భాగ్యలక్ష్మి, ఎండీ అంజుమ్‌, రాజక్క ఉన్నారు.

వైద్య విద్యార్థినికి ఆర్థికసాయం


నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

ఎలిగేడు: మండలంలోని సుల్తాన్‌పూర్‌ గ్రామానికి చెందిన కీర్తి శరణ్య ఇటీవల వెల్లడించిన నీట్‌ ఫలితాల్లో 979 ర్యాంకు సాధించింది. విద్యార్థి తండ్రి లచ్చయ్య పేదరికం విషయం తెలుసుకున్న 1992–93 ఎస్సెస్సీ చదివిన పూర్వ విద్యార్థులు ముందుకు వచ్చి రూ.51,116 అందజేశారు. పల్లె శ్రీనివాస్‌గౌడ్‌, మెండయ్య, లైన్‌ ఇన్‌స్పెక్టర్‌ పల్లెర్ల శ్రీనివాస్‌, కడవేర్ల నటరాజ్‌, శివపల్లి రాములు, సిరికొండ సంపత్‌, ఆకుల తిరుపతి, భరోసా చైర్మన్‌ నాగరాజు పాల్గొన్నారు.

క్షీరాభిషేకం

ధర్మారం: వీఆర్‌ఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించినందుకు ధర్మారం మండల కేంద్రంలోని అంబేడ్కర్‌ చౌరస్తాలో మంగళవారం మండల వీఆర్‌ఏలు సీఎం కేసీఆర్‌, రాష్ట్ర మంత్రులు హరీశ్‌రావు, కొప్పుల ఈశ్వర్‌, ఎమ్మెల్సీ కవితల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.
కమాన్‌పూర్‌: మండల కేంద్రంలోని తహసీల్దార్‌ కార్యాలయం వద్ద సీఎం కేసీఆర్‌ చిత్రపటానికి వీఆర్‌ఏలు మంగళవారం క్షీరాభిషేకం చేశారు. వీఆర్‌ఏల సంఘం మండల అధ్యక్షుడు కోటేష్‌, ప్రధాన కార్యదర్శి ఎండీ అఫ్జల్‌, అనవేన శివకుమార్‌, రజిత, స్వప్న, వెంకటస్వామి, ప్రేమ్‌కుమార్‌, రాజన్న, నరేశ్‌, రవి, నర్సయ్య, రాధ పాల్గొన్నారు.



పెద్దపల్లిలో రెండు రోజులుగా వర్షం నిరంతరాయంగా కురుస్తోంది. మంగళవారం భారీ వర్షం కురిసింది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు ఉద్యోగస్తులు, వ్యాపారం చేసే వారు తిప్పలు పడ్డారు. వర్షంలో తడుస్తూనే గమ్యస్థానాలకు చేరుకున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్‌, పెద్దపల్లి

మెడికల్‌ కాలేజీ సమస్యలపై కలెక్టర్‌తో భేటీ

గోదావరిఖని: మెడికల్‌ కళాశాలలో నెలకొన్న సమస్యలపై కలెక్టర్‌ ముజామిల్‌ఖాన్‌తో రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌ మంగళవారం భేటీ అయ్యారు. కలెక్టర్‌ కార్యాలయంలో సమావేశమై పలు సమస్యలపై చర్చించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులు, వారి సహాయకులకు కల్పించాల్సిన మెరుగైన వసతుల కల్పన, రోగుల సహాయకులు కూర్చోడానికి కుర్చీలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాత్రి పూట ఆశ్రయంలేక అవస్థలు పడుతున్నారన్నారు. ఆసుపత్రి ఆవరణలో ఉన్న మార్చురీ గదిని మరో చోటికి తరలించాలని కోరారు. సహాయకులకు కుర్చీలు సమకూర్చాలని, ఎన్టీపీసీ సీఎస్‌ఆర్‌ నిధులతో రాత్రిపూట ఆశ్రయం కోసం షెడ్‌, అల్పాహారం కోసం క్యాంటీన్‌, మెడికల్‌ కళాశాలలో ఇంటర్నల్‌ రోడ్లు నిర్మించాలని కోరగా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. అలాగే డీఎంఎఫ్‌టీ నిధులతో చేపట్టాల్సిన అభివృద్ధి, ప్రజాసంక్షేమ కార్యక్రమాలపై చర్చించారు.

కొనసాగిన పంచాయతీ కార్మికుల సమ్మె


కాల్వశ్రీరాంపూర్‌: దీక్షలో పాల్గొన్న కార్మికులు

జూలపల్లి: ఎంపీడీవో కార్యాలయం ఎదుట వేసిన దీక్షా శిబిరం వద్ద గ్రామాల నుంచి వచ్చిన కార్మికులు వర్షంలో నిలబడి నిరసన తెలిపారు. కారోబార్ల సంఘం మండల ఉపాధ్యక్షుడు తుమ్మ మధు, కార్మికులు తిరుపతి, భాస్కర్‌, పురుషోత్తం, పుట్ట మల్లేశం, రాంచంద్రం, లింగమ్మ, అనిల్‌, అజయ్‌, సతీశ్‌, నాగయ్య, లచ్చయ్య, బాణయ్య ఉన్నారు.
ఎలిగేడు: మండలకేంద్రంలో చేపట్టిన సమ్మెలో జీపీ ఉద్యోగ, కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఇరుగురాల లచ్చయ్య, తీట్ల శ్రీనివాస్‌, కవ్వంపల్లి దేవయ్య, కవ్వంపల్లి ఓదెలు, ఇరుగురాల నర్సయ్య, సరీన్‌, శ్రీనివాస్‌, మొగిలి, కొండయ్య పాల్గొన్నారు.
ధర్మారం: మండల పరిషత్‌ కార్యాలయం ఎదుట కార్మికులు చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా మంగళవారం మహిళా పంచాయతీ కార్మికులు బతుకమ్మ ఆడుతూ నిరసన తెలిపారు.
కాల్వశ్రీరాంపూర్‌: జీపీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు కలవేన గట్టయ్య అన్నారు. వర్షం కురుస్తున్నప్పటికీ ప్లాస్టిక్‌ పరదాలు వేసుకుని దీక్ష కొనసాగిస్తున్నారు. నాయకులు రాజబాబు, గౌసుద్దీన్‌, సంపత్‌, రాజయ్య, కొమురయ్య, రామస్వామి, లక్ష్మి, అనసూర్య, లక్ష్మణ్‌, మధునయ్య పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

✦సబ్బితం జలపాతానికి రావొద్దు

పెద్దపల్లిరూరల్‌: పెద్దపల్లి మండలంలోని సబ్బితం గౌరీగుండాలు జలపాతం వైపు ఎవరూ రావొద్దని బసంత్‌నగర్‌ ఎస్సై వెంకటేశ్‌ అన్నారు. జలపాతాన్ని మంగళవారం ఎస్సై తన సిబ్బందితో సందర్శించారు. అక్కడకు చేరిన యువతకు కౌన్సెలింగ్‌ ఇచ్చి వెనక్కి పంపించారు. జలపాతం నీటి ఉధృతి ఎక్కువగా ఉందని, ప్రమాదాలు జరిగే అవకాశముందని పేర్కొన్నారు.

✦పారిశుధ్యం పరిశీలన

కమాన్‌పూర్‌: రామగిరి మండలంలోని రత్నాపూర్‌ గ్రామంలో సోమవారం మండల ప్రత్యేక అధికారి సాయినాథ్‌ పర్యటించారు. గ్రామంలో వాడవాడలా తిరిగి పారిశుధ్యాన్ని పరిశీలించారు. సీజనల్‌ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ప్రజలు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆయన వెంట సర్పంచ్‌ పల్లె ప్రతిమ, ఎంపీవో భాస్కర్‌, కార్యదర్శి రమ్య, వైద్య సిబ్బంది ఉన్నారు.

✦ముగిసిన భాగవత సప్తాహం

మంథని: మంథనిలోని తమ్మిచెరువుకట్ట హనుమాన్‌ ఆలయ ప్రాంగణంలో వారంరోజుల పాటు పురాణం మహేశ్వర శర్మచే నిర్వహించిన భాగవత సప్తాహం మంగళవారంతో ముగిసింది. కాగా మానవజన్మ జ్ఞాన సముపార్జనకు ఉపయోగించాలని పురాణం మహేశ్వర శర్మ వివరించారు.

✦ఆటోకు తప్పిన ప్రమాదం

మంథని: మండలంలోని కాకర్లపల్లిలో మంగళవారం ఓ ఆటోకు ప్రమాదం తప్పింది. మంథని నుంచి ముత్తారం మండలం రామకిష్టాపూర్‌కు ప్రయాణికులతో వెళ్తున్న ఆటో కాకర్లపల్లి వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న వరదలో అదుపుతప్పి పక్కకు ఒరిగింది. ఆటోలో ఉన్న ప్రయాణికులు ఎవరికీ ఏమీ కాలేదు.

✦ఘనంగా పీరీల ఊరేగింపు

యైటింక్లయిన్‌కాలనీ: మొహర్రం పండుగను పురస్కరించుకొని రామగుండం కార్పొరేషన్‌ యైటింక్లయిన్‌కాలనీ అల్లూరు గ్రామంలో మంగళవారం పీరీలను ఊరేగించారు. అల్లూరు దర్గాలోని పీరీలను మంగళవారం నుంచి ఐదురోజుల పాటు యైటింక్లయిన్‌కాలనీలో ఊరేగించనున్నట్లు నిర్వాహకులు నిజాముద్దీన్‌, తాజోద్దీన్‌ తెలిపారు.

✦డ్రైనేజీ నిర్మాణానికి నిధులు మంజూరు

జూలపల్లి: మండలంలోని వడ్కాపూర్‌ గ్రామం ఆరో వార్డులో డ్రైనేజీ నిర్మాణానికి 2.50 లక్షల నిధులు మంజూరు కాగా పత్రాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ రఘువీర్‌సింగ్‌ సర్పంచ్‌ మాంకాలి తిరుపతికి అందజేశారు.

✦సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కులు పంపిణీ

కమాన్‌పూర్‌: మండలంలోని గుండారం గ్రామానికి చెందిన గాదె సంధ్యకు రూ.58వేలు, పిడుగు తిరుపతమ్మకు రూ.26వేల సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కులు ప్రభుత్వం నుంచి మంజూరయ్యాయి. కాగా చెక్కులను మంగళవారం బీఆర్‌ఎస్‌ నాయకులు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, దండె కనుకరత్నం, కిషన్‌, బొల్లపెల్లి శంకర్‌గౌడ్‌, కందుల మధు, సాన సురేశ్‌ పాల్గొన్నారు.

✦పీఆర్‌సీ కమిటీని ఏర్పాటు చేయాలి

కమాన్‌పూర్‌: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం పీఆర్‌సీ కమిటీని ఏర్పాటు చేసి ఐఆర్‌ ప్రకటించాలని కోరుతూ తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ (టీపీయూసీ) ఆధ్వర్యంలో మంగళవారం కమాన్‌పూర్‌, రామగిరి మండలాల శాఖ అధ్వర్యంలో తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు. భోజన్నపెల్లి వెంకటేశ్వర్లు, వీరస్వామి, నాగరాజు, పవన్‌ ఉన్నారు.

✦పాఠశాలలో తల్లిదండ్రుల దినోత్సవం

గోదావరిఖనిటౌన్‌: పట్టణంలోని కల్యాణ్‌నగర్‌లోని లిటిల్‌ బ్లూమ్స్‌ పాఠశాలలో మంగళవారం తల్లిదండ్రుల దినోత్సవం నిర్వహించారు. ప్రముఖ వైద్యురాలు డాక్టర్‌ లక్ష్మీవాణి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం తల్లిదండ్రులకు విద్యార్థులు పాదపూజ కార్యక్రమం నిర్వహించారు. తల్లిదండ్రులకు పాఠశాల యాజమాన్యం మొక్కలు బహూకరించింది.

తరగతి గదిలోకి వరద



కమాన్‌పూర్‌: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్‌ పాఠశాల గదుల్లోకి వర్షం నీరు చేరడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల ఆవరణలో మట్టికుప్పలు, ఇసుక, కంకర చెల్లాచెదురుగా ఉన్నాయి. గదుల పనులు పూర్తికాకపోవడంతో అసంపూర్తిగా ఉన్న ఉర్దూ మీడియం పాఠశాలలో తరగతులు నిర్వహిస్తున్నారు. వర్షం కురిసిన ప్రతిసారీ విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.

జనావాసాల్లోకి జాతీయ పక్షి

యైటింక్లయిన్‌కాలనీ: అడవి నుంచి తప్పిపోయిన జాతీయ పక్షి నెమలి మంగళవారం రామగిరి మండలంలోని చందనాపూర్‌కు చెందిన ఇజ్జగిరి ఓదెలు ఇంటికి వచ్చింది. అతను గోదావరిఖని టూటౌన్‌ పోలీసులకు సమాచారం అందించాడు. వెంటనే వారు గ్రామానికి చేరుకొని, మంథని ఫారెస్ట్‌ అధికారులకు సమాచారం ఇచ్చారు. టూటౌన్‌ ఏఎస్సై సుధాకర్‌, కానిస్టేబుళ్లు రాజయ్య, మల్లేశ్‌, హోంగార్డు కుమార్‌ ఫారెస్ట్‌ ఆఫీసర్‌ రాజేంద్రప్రసాద్‌కు నెమలిని అప్పగించారు.

ఓదెలలో జూనియర్‌ సివిల్‌ జడ్జి కోర్టు ఏర్పాటు చేయాలి


మంత్రికి వినతిపత్రం ఇస్తున్న శంకర్‌

ఓదెల: ఓదెలలో జూనియర్‌ సివిల్‌జడ్జి కోర్టు ఏర్పాటు చేయాలని ఓదెలకు గ్రామానికి చెందిన హైకోర్టు న్యాయవాది పొలాస శంకర్‌ న్యాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని కలిసి మంగళవారం వినతిపత్రం అందించారు. ఓదెల, కాల్వశ్రీరాంపూర్‌ మండలాల్లో అనేక రకాల కేసులు పెరిగిపోయాయని, కేసుల పరిష్కారంలో జాప్యం జరుగుతున్నందున మండలాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు వినతిపత్రం అందించారు. ఓదెలలో నూతన కోర్టుకు తాత్కాలిక భవనాలు సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ విషయాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించినట్లు న్యాయవాది పేర్కొన్నారు.